# జన ప్రభంజనం

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రచారానికి జన నీరాజనం



అభివాదిస్తున్న నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత



పెద్దపల్లి : పట్టణంలో జరిగిన రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు



రామగిరి : సెంటినరీ కాలనీలో జరిగిన సభలో ఎమ్మెల్సీ కవితకు ఫొటో ఫ్రేం అందజేస్తున్న యువకులు



రామగిరి : సెంటినరీ కాలనీ వాణీవిద్యానికేతన్ పాఠశాల మైదానంలో జరిగిన సభలో టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షరాలు, ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వెంకట్రావు, కెంగెర్ల మలయ్య, మిర్యాల రాజిరెడ్డి



రామగిరి : సెంటినరీ కాలనీ వాణీవిద్యానికేతన్ పాఠశాల మైదానంలో జరిగిన సభలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత, పక్కన బీఆర్ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధూకర్

- జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా కవిత క్యాంపెయిన్
- ధర్మపురి, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో సభలు, రోడ్‌షోలు
- అశేషంగా తరలివచ్చిన జనం
- కాటారం, రామగిరిలో అపూర్వ స్పందన
- ఆద్యంతం ఆకట్టుకున్న ప్రసంగం
- కొప్పుల, పుట్ట మధూకర్, దాసరిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి
- గులాబీ శ్రేణుల్లో ఫుల్ జోష్

పెద్దపల్లి, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ)/ మంథని/పెద్దపల్లి/రామగిరి : నిజామాబాద్ ఎమ్మెల్సీ, భారత జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు జిల్లా ప్రజలు నీరాజనం పట్టారు. జిల్లాలోని బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం ఆమె ప్రచారం చేయగా, ఎక్కడికక్కడ పోటెత్తారు. ఉదయం ధర్మపురి నృసింహుడి క్షేత్రంలో పూజలు చేసిన ఆమె, అనంతరం ధర్మపురి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ధర్మపురి పట్టణ మహిళలతో సమావేశమయ్యారు. అనంతరం పెగడపల్లి, గొల్లపల్లిలో నిర్వహించిన రోడ్ షోలకు హాజరయ్యారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలతో ఉన్నది పేగు బంధమని, అధికారంలో లేని నాడు ప్రజలతో ఉన్నామని, ఇప్పుడు కూడా ప్రజలతోనే ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్‌కు పెట్టే గుణం లేదని, అధికార కాంక్ష మాత్రమే ఉందని విమర్శించారు. కాంగ్రెస్ యాభై ఏండ్ల పాలనలో ఈ ప్రాంత ప్రజలు అరిగోస పడ్డారని, మళ్లీ ఆ పార్టీని నమ్మితే రాష్ట్రాన్ని అంధకారం చేస్తుందని, మరో ఐదేండ్లు ఏడుపు తప్పదని హెచ్చరించారు. ధర్మపురి ప్రాంత అభివృద్ధికి ఎనలేని అభివృద్ధి చేస్తున్న కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### పుట్ట మధును భారీ మెజార్టీతో గెలిపించండి

ధర్మపురి పర్యటన అనంతరం ఎమ్మెల్సీ కవిత మంథని అసెంబ్లీ అభ్యర్థి పుట్ట మధూకర్‌కు మద్దతుగా నియోజకవర్గంలోని ప్రచారం చేశారు. సాయంత్రం 5గంటలకు కాటారంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, జయశంకర్ భూపాల్‌పల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీరాకేశ్‌తో కలిసి హాజరయ్యారు. ఆ తర్వాత రాత్రి 7.50 గంటలకు రామగిరి మండలకేంద్రంలోని సెంటినరీ కాలనీ వాణీవిద్యానికేతన్ పాఠశాల మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలోనూ పాల్గొన్నారు. ఆయాచోట్ల నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీగా వచ్చారు. కవితకు ఘన స్వాగతం పలికారు. రెండు సభలకు వేలాదిగా జనం తరలివచ్చారు. ఆయాచోట్ల కవిత ఆకట్టుకునేలా ప్రసంగించారు. గడిచిన తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్మిక వర్గానికి టీబీజీకేఎస్ చేసిన మేలు, చారిత్రాత్మకమైన వారసత్వ ఉద్యోగాలు, కార్మికుల తల్లిదండ్రులకు ఖరీదైన కార్పొరేట్ వైద్యం, సింగరేణి మెడికల్ కళాశాల్లో కార్మికుల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్లు, డిస్మిస్ కార్మికులకు అవకాశాలు, లాభాల వాటా, బోనస్ లాంటి అంశాలను ప్రస్తావించారు. పని చేసే ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను నమ్మితే చీకట్లో మునిగిపోతామని హెచ్చరించారు. మంచి మనసు ఉన్న వ్యక్తి పుట్ట మధు అంటూ ప్రశంసల జల్లు కురిపించారు. మధు గెలిచినా.. ఓడినా ప్రజల్లో ఉన్నాడని, కానీ శ్రీధర్‌బాబు ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. మధును భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ దత్తత తీసుకుంటారని, వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తారని చెప్పారు. పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్లీ శ్రీధర్‌బాబు నియోజకవర్గం అభివృద్ధిలో ఐదేళ్లు వెనక్కిపోతుందని విమర్శించారు. ప్రజలారా వివేకంతో ఆలోచించాలని, పుట్ట మధును గెలిపించాలని కోరారు.

### మనోహర్‌రెడ్డికి హ్యాట్రిక్ ఇవ్వండి

మంథని సభల తర్వాత ఎమ్మెల్సీ కవిత రాత్రి 8.30 గంటలకు పెద్దపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి తరపున ప్రచారం చేశారు. జిల్లా కేంద్రంలో జరిగిన జెండా చౌక్‌లో రోడ్డు షో నిర్వహించి ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. దూరమైన పాలనను పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు చేరువ చేసి, పెద్దపల్లిని జిల్లా కేంద్రం చేసి ఇండ్ల ముందుకు పాలనను, కండ్ల ముందుకు అధికారులను తీసుకు వచ్చామని చెప్పారు. అభివృద్ధికి పట్టం కట్టి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి హ్యాట్రిక్ విజయం ఇవ్వాలని కోరారు.

### ఆకట్టుకున్న ప్రసంగం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆద్యంతం తన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. ప్రసంగం ప్రారంభం నుంచే అభిమానులు, కార్యకర్తలు నయా జోష్ నింపేలా ప్రసంగాన్ని ప్రారంభించారు. మనది కార్మిక గడ్డ.. తెలంగాణ ఉద్యమంలో ఎలా ఉత్సాహంగా పాల్గొన్నామో.. ఇప్పుడు అలాగే ఉత్సాహంగానే ఉండాలని, అందరూ నాలాగా అందరు పిడికిలి బిగించి కొట్టాలని ఆమె పిలుపునివ్వగా, సభికులంతా చేతులు పైకెత్తి జైకొట్టారు. రాబోయే రోజుల్లో కాబోయే ఎమ్మెల్యే మన మధన్నే అంటూ నినదించగా, ప్రజలంతా చప్పట్లతో మద్దతు తెలిపారు. మంథని నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిందేమీ లేదని, ఆయన అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులు గుర్తు చేసుకోవాలని, ఈ నెల 30న పొద్దన్నే నిద్రలేచి దేవుడికి దండం పెట్టి ఇంట్లో ఉన్న స్విచ్ ఆన్ చేయాలని, కరెంటు బుగ్గ వెలిగితేనే బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. 'మనదేం గుర్తు.. కారు గుర్తు' అంటూ నినాదాలు చేయిస్తూ సభను హోరెత్తించారు. మొత్తంగా కవిత పర్యటన విజయవంతం కావడంతో శ్రేణుల్లో జోష్ నిండింది.



రామగిరి : సెంటినరీ కాలనీ వాణీవిద్యానికేతన్ పాఠశాల మైదానంలో జరిగిన సభకు హాజరైన జనం

## పెద్దపల్లిలో దాసరి గెలుపు ఖాయం

- మెజార్టీ కోసమే ప్రచారం
- పెద్దపల్లి రోడ్‌షోలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



రోడ్ షోలో మాట్లాడుతున్న కవిత

పెద్దపల్లి, నవంబర్19: పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి గెలుపు ఖాయమైందని, మెజార్టీ కోసమే ప్రచారం చేస్తున్నామని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం రాత్రి ప్రచారంలో పెద్దపల్లి జెండా కూడలిలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో పాల్గొన్నారు. అక్కడికి తరలివచ్చిన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. నగర పంచాయతీగా ఉన్న పెద్దపల్లిని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి పెద్దమొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. చివరి ఆయకట్టు మండలాలు శ్రీరాంపూర్, ఓదెలకు సాగునీరు అందక రైతులు ఆందోళనలు చేస్తే అనాటి ప్రభుత్వం రైతులపై కేసులు పెట్టిందని గుర్తు చేశారు. కానీ సీఎం సాగు నీరందించి పెట్టుబడి సాయం ఇచ్చి రైతులకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. డీ-83, 86 కాలువలను లింక్ కెనాల్ ద్వారా కాళేశ్వర జలాలు మన బీడు భూములను తడుపుతున్నాయన్నారు. దాసరి మనోహర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ పెద్దపల్లిని జిల్లాగా ప్రకటించారని చెప్పారు. ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్న కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. పెద్దపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మనోహర్‌రెడ్డికి అఖండ మెజార్టీతో అసెంబ్లీకి పంపించాలని కోరారు.